క్లుప్తంగా

మిరపలో సస్యరక్షణపై అవగాహన



మిరప రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి

దొర్నిపాడు: మిరపంటలో నల్లతామర, రసం పీల్చే పురుగు, వేరు కుళ్లు తెగుళ్లపై ఉద్యానవన శాఖ అధికారి నరేష్ కుమార్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానికంగా సాగుచేసిన మిరప పంటలను ఆయన పరిశీలించారు. మిరప పంటలో నీలం, పసుపు పచ్చ, తెలుపు వర్ణాలు కల్గిన జిగురు అట్టలను ఎకరానికి కనీసం 100కు పైగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బవేరియా, వర్టిసీలియంలను పిచికారీ చేస్తే నల్లతామరను అదుపు లో ఉంచవచ్చన్నారు. ముడత తామర పురుగులకు అసిఫెట్ లీటర్ నీటికి 1.5 గ్రాములు, అసిటామప్రిడ్ లీటరు నీటికి 0.2 గ్రాములు, ఫిప్రొనిల్ లీటర్ నీటికి 2మిల్లీగ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. వీటిని రెండు సార్లకంటే పంటకు పిచికారీ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు మల్లికార్జున, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ విషయంలో వివాదం

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో భూమా కిషోర్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రౌండ్ లెవెల్ వాటర్ ట్యాంక్ వివాదాస్పదంగా మారింది. ట్యాంకుకు గ్రామ పంచాయతీ బోరు నుంచి కనెక్షన్ ఇవ్వడంతో గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామంలోని చర్చి ప్రాంగణంలో (సీఎండీఎఫ్) బోరు వేయించి మోటర్ అమర్చారు. నాటి నుంచి నేటి వరకు ఆ బోరు మోటార్ మెయింటెనెన్స్ అంతా గ్రామ పంచాయతీ భరిస్తోంది. అయితే ప్రస్తుతం బీజేపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి చర్చి ప్రాంగణంలో పంచాయతీ అనుమతులు లేకుండానే గ్రౌండ్ లెవెల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి, పంచాయతీ బోరు మోటార్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో వివాదం నెలకొంది. ఈ ఘటనపై గ్రామ సర్పంచు నిర్మలాదేవి, పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ భూమా కిషోర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని రుద్రవరం ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



తెల్లవారుజామునే పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ దాసు

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి మున్సిపల్ అధికారులు కంకణం కట్టుకున్నారు. ప్రతి వార్డులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతున్నారు. మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాలలో ఉదయం 5 గంటల నుంచే శానిటేషన్ పనులను పలువురు అధికారులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలవారకముందే సచివాలయ శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో రోడ్లు, కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు.

జిగురు అట్టలతో నల్ల తామరకు చెక్

నంద్యాల(అర్బన్): జిగురు అట్టల ఏర్పాటుతో మిరపలో నల్లతామర పురుగును నివారించుకోవచ్చని నంద్యాల మండల ఉద్యాన శాఖాధికారి శ్రీధర్ తెలిపారు. ఎకరా పంటలో పుసుపు-20, నీలి రంగు-20, తెలుపు రంగు-20 జిగురు అట్టల చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిరపలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై మండలంలోని పుసులూరు, మిట్నాల గ్రామాల్లో మిరప సాగు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

29వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు

చాగలమర్రి: నంద్యాల జిల్లాలో 29 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలైన కొబ్బరి, మామిడి, జామా, మునగ, మల్లె పూల తోటలను ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేస్తున్నారని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం చాగలమర్రిలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఆయన చాగలమర్రి గ్రామంలో కొబ్బరి, మల్లె పూల తోటలను పరిశీలించారు.

వైద్య సేవల్లో ఆదర్శం జగనన్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- కానాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



కానాలలో గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): వైద్య సేవల్లో జగనన్న ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో నూతనంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుతో పాటు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపారన్నారు. నంద్యాల మండల మేజర్ పంచాయితీ కానాల గ్రామంలో మంగళవారం సచివాలయం -2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యులు 799 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మర్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ఆరోగ్య రక్షగా మారిందని నంద్యాల నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు సచివాలయం 2 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

నంద్యాల టౌన్: పట్టణంలోని ఎన్జీవో కాలనీ, హరిజనవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పరిశీలించారు. హరిజనవాడ ఆరోగ్య కేంద్రంలో 10వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మజీద్ సందర్శించారు.

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం సర్పంచు బైరి విజయలక్ష్మి, ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, వైద్యబృందం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచులు మాధవీలత, మాధవీ, జెడ్పీటీసీ శకుంతల పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో హెల్త్ కార్డులను ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ జెడ్పీటీసీ పుణ్యలక్ష్మిదేవి గ్రామ సర్పంచ్ నడిపెన్న తదితరులు అందజేశారు.

చాగలమర్రి: ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ తొలసమ్మల ఆధ్వర్యంలో చాగలమర్రి సచివాలయం-3 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్న ప్రాశన కార్యక్రమాలను నిర్వహించారు.

ఎనలేని సంక్షేమం.. వెల్లువెత్తిన అభిమానం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అనేక మందికి రూ లక్షల్లో నగదు జమ అయినట్లు రూరల్ మండలం కోటకందుకూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులు సంతోషంగా తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మండల అధ్యక్షులు గజ్జల రాఘవేంద్రారెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజా సమస్యలపై ఆరాతీశారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా ఏమాత్రం సిఫార్సులు లేకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే వచ్చి అందజేస్తున్నారని వెల్లడించడం గమనార్హం. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాదాపీర్, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు రామకృష్ణ, కొలిమి బాషా, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు జలజీవన్ మిషన్ పథకం కింద వాటర్ ట్యాంక్‌లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కిరణ్‌బాబు మంగళవారం తెలిపారు. కోటపాడులో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ. 1.09 కోట్లు మంజూరయ్యాయన్నారు. బోరు, మోటార్, పైప్‌లైన్ ఏర్పాటు జరుగుతుందన్నారు. అలాగే వీరారెడ్డిపల్లెలో వాటర్ ట్యాంక్‌కు రూ. 51.48 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పారు.

గ్రామ సంఘాలన్నీ ఏ గ్రేడ్ సాధించాలి



ఎంబ్రాయిడరీ మిషన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

గోస్పాడు: పొదుపు గ్రూప్‌లకు సంబంధించిన గ్రామ సంఘాలన్ని ఏ గ్రేడ్ సాధించేలా సిబ్బంది శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఏ జిల్లా పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాల వీఓ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. సీఐఎఫ్, శ్రీనిధి, ఉన్నతి పథకాలకు సంబంధించి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలని, వంద శాతం గ్రూపుల్లో వృద్ధి సాధించాలని ఆదేశించారు. మొబైల్ బుక్ కీపింగ్ గ్రేడింగ్‌లు సక్రమంగా ఉండేలా, ప్రతి గ్రూపు ఏ గ్రేడ్ సాధించేలా పొదుపు సభ్యులకు సిబ్బంది తరచూ అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పీఎంఈజీపీ కింద గోస్పాడులో మంజూరైన ఎంబ్రాయిడరీ మిషన్ ను ప్రారంభించారు. గ్రామానికి చెందిన పొదుపు సభ్యురాలు జ్యోతీశ్వరీ స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ద్వారా రూ.4.20లక్షలు 35శాతం సబ్సిడీ కింద మంజూరైన సొమ్ముతో ఎంబ్రాయిడరీ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శ్రీశక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట డీపీఎం దానం, ఏపీఎం రామశేఖర్ రెడ్డి, సీసీ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

మామిడిలో చెదల నివారణే కీలకం



రాయమల్పురం వద్ద మామిడితోటలో చెదలనివారణ మందు పిచికారీ

నంద్యాల(సెంట్రల్): మామిడిలో చెదలతో పాటు క్రిమికీటకాల నిర్మూలన అత్యంత ఆవశ్యకమని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. మామిడి చెట్లకు అక్టోబరు చివర, నవంబరు మొదటి వారం నుంచి పూత రావడం ప్రారంభమవుతుంది. దీంతో చెదలు పట్టడం, క్రిమికీటకాలు చేరడం మొదలవుతుందని చెప్పారు. పూతను సకాలంలో సంరక్షించుకుంటే దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. వంద లీటర్ల నీటిలో 8 కిలోల రాళ్ల సున్నం, 3 కిలోల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా క్లోరో పైరిఫాస్ మందును కలిపి ఒక రోజు ముందు నానబెట్టాలి. తయారైన పేస్టును చెట్టు కింది నుంచి రెండున్నర అడుగుల మేర మొదలు చుట్టూ పూయాలి. దీంతో చెట్టుకు కావాల్సిన వేడి అందుతుంది. చెదలు రాకుండా నివారిస్తుంది. ఇతర క్రిమికీటకాలు దరిచేరవు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నాణ్యమైన విద్య అనే అంశంపై జిల్లా స్థాయిలో ఎంఈఓలకు, స్కూల్ కంప్లెక్స్ హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమన్ని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా విద్యారంగ పరిస్థితులను అంచనా వేసి, విద్యా పథకాలను ప్రవేశపెడతారన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నాణ్యమైన విద్య ముఖ్యాంశం అన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,119 పైచిలుకు పాఠశాలల్లో 10,113 మందికి పైగా విద్యార్థులను ఈ సర్వే ద్వారా పరీక్షిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ లలిత, డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ అమ్మవారి శాలలలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



నంద్యాల బాలాజీ కల్యాణ మండపంలో కరెన్సీ నోట్లతో లక్ష్మిదేవి అలంకారం

జగన్మాతా.. నమోస్తుతే

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని మూడో రోజైన మంగళవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

- పట్టణంలోని శ్రీకాళికాంబదేవస్థానంలో శ్రీకాళికాంబదేవికి ఉదయమే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి మధుర మీనాక్షి అలంకారంలో అలంకరించారు. ఉదయం కూష్మాండదేవి అలంకారం, సాయంత్రం ప్రత్యేక మండపాల్లో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. సాయంత్రం మండపంలో ఉత్సవ మూర్తికి బ్రహ్మణిదేవిగా అలంకరించారు.
- స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకశెట్టి సుబ్బమ్మ కల్యాణ మండపంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మిదేవిగా అలంకరించారు.
- స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. శివాలయంలోని కాశీవిషాలాక్షిని చంద్రఘంటదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శ్రీమహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీగిరిజాదేవి, కూష్మాండదేవిలుగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.
- స్థానిక తెలుగుపేటలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దుర్గాదేవి విగ్రహాన్ని చంద్రఘంట దేవిగా అలంకరించారు.
- ఎన్జీవో కాలనీ రామాలయంలో దుర్గాదేవిని గాయత్రిదేవిగా అలంకరించారు.
- నందమూరి నగర్ రామాలయంలో మూడవ రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకారంలో అలంకరించారు.

ఆళ్లగడ్డ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారి శాలలో వాసవీమాత మూడోరోజు గాయత్రీ దేవిగా భక్తులకు అభయమిచ్చారు.

దొర్నిపాడు: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఉయ్యాలవాడ: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం మూడో రోజు చౌడేశ్వరీదేవి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

చాగలమర్రి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ముత్యాలపాడు గ్రామంలో 3వ రోజు అమ్మవారు శ్రీమినాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శిరివెళ్ల: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు లలితాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రుద్రవరం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జనరంజక పాలనతో ప్రజలు సుభిక్షం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలో ప్రతి పేదవాడి అభ్యున్నతికి పాటుపడి జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటిని సందర్శించిన ఎమ్మెల్యే శిల్పా రవి ఆప్యాయంగా చిన్నారులను, పెద్దలను పలకరించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించారు. వార్డు అభివృద్ధికి సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు విరివిగా అందించడంలో ఎటువంటి అడ్డంకులు ఉన్నా తెలియజేయాలని ప్రజలను కోరారు.

పేదల సంక్షేమానికి పెద్దకొడుకులా..

పేదలకోసం వారి పెద్ద కొడుకులాగా, అన్ని వర్గాలతో పాటు అన్ని వయస్కుల వారికి సంక్షేమాన్ని అందించేందుకు ప్రత్యేక పథకాలు 98శాతం పైగా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే అన్నారు. కుల మతాలకు అతీతంగా, రాజకీయాలకు సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా అర్హతే ఆధారంగా పథకాలను అందిస్తున్నామన్నారు. నంద్యాలలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులను కేవలం నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసి చూపించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, పట్టణ 1వ అధ్యక్షుడు పున్నాశేషయ్య, కౌన్సిలర్లు సాదిక్, కలాంబాషా, చంద్రశేఖర్, తబ్రేజ్, సమద్, కోఆప్షన్ సభ్యులు సలామల్లా, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

నంద్యాల: ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల నియోజకవర్గ పరిధిలో సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరైన వారికి ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న షేక్‌హమద్‌బాను (రూ.50వేలు), బెక్కంహేమలత (రూ.65,000), లలితమ్మ (రూ.75,000), మంటి హుసేని (రూ.65వేలు), బోరెడ్డి రాజేశ్వరి (రూ. 60వేలు), సిరియపు రెడ్డి వీరాదేవి (రూ.1,70,000)లు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, దేశం సుధాకర్‌రెడ్డి, బాసిద్, కిరణ్‌కుమార్, టీవీ రమణ, గన్ని కరీం తదితరులు పాల్గొన్నారు.

మోదీ కుట్రపూరిత వైఖరి వల్లే సీమ ఎడారి

నంద్యాల(న్యూటౌన్): మోదీ కుట్రపూరిత వైఖరి వల్లే సీమ ఎడారి కాబోతుందని, బీజేపీ వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల ముందు అప్పర్ భద్ర ప్రాజెక్ట్ కేంద్ర ప్రాజెక్ట్‌గా ప్రకటించి రూ.5,300లను మంజూరు చేసి, ఎడారిగా ఉన్న రాయలసీమను శాశ్వత ఎడారిగా మార్చేందుకు మోడి కుట్ర పన్నారన్నారు. అలాగే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అనుగునంగా నీరు వదలడం లేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబఫక్రుద్దీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 17, 18, 19 తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలకు 26 జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొంటారన్నారు,. 17వ తేదీన మహాప్రదర్శన రెండురోజుల ప్రతినిధుల సభ ఉంటాయన్నారు.

గాజాపై సైనిక దాడులు నిలిపివేయాలి

నంద్యాల(న్యూటౌన్): గాజాపై ఇజ్రాయిల్ సైనిక దాడులు నిలిపివేయాలని కోరుతూ నంద్యాల పట్టణంలో సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో బొమ్మలసత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు మాట్లాడుతూ యుద్ధాలకు కారణం అవుతున్న సామ్రాజ్యవాదం నశించాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని ఇజ్రాయిల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, దాసు, సుబ్బన్న, సులోచన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు భర్త లేకపోవడం, కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకై కర్నూలుకు తరలించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో నెలవారీ కేటాయించిన లక్ష్యం మేరకు గర్భిణులు ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం వైద్య, విద్యాశాఖల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణులకు ప్రసవాలు జరిగేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. దీబగుంట్ల, టంగుటూరు పీహెచ్‌సీలలో జీరో డెలివరీలు చూపించడంపై అసహనం వ్యక్తం చేశారు.

నాడు నేడు నిర్మాణ పనులు పూర్తి చేయండి

నాడు నేడు నిర్మాణ పనులు వెంటనే, బడి బయట ఉన్న పిల్లలు (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే)కు సంబంధించి సర్వే త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, డీఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించి జాప్యం చేస్తే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్ హెచ్చరించారు. ప్రాధాన్యత భవనాల ప్రగతి, జల జీవన్ మిషన్ అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర భవనాల నిర్మాణల పురోగతిపై ప్రతి వారం చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తున్న నేపథ్యంలో నిర్దేశిత లక్ష్య ప్రగతిపై పూర్తిస్థాయి దృష్టి సారించాలన్నారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



పొలాల సాగును పరిశీలిస్తున్న ఆర్డీఓ

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. జిల్లెల్ల గ్రామంలో రైతు బాలమద్దిలేటి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాన్ని సందర్శించారు. దేశవాళీ రకాలు బ్లాక్‌రైస్, రెడ్‌రైస్, బాస్మతి రైస్ వంటి పైర్లు సాగు చేస్తున్న పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బ్లాక్ రైస్, రెడ్‌రైస్ ప్రాధాన్యతల గురించి రైతు వివరించాడు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ధాన్యంలో పోషకాలు అందుతాయని, సమాజానికి ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ విజయశేఖర్, వీఆర్‌ఓ ఆదినారాయణరెడ్డి, గోపాల్ రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: జగనన్న భూ హక్కు- భూ రక్ష రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని సాంబవరం, జిల్లెల్ల గ్రామాల్లో భూ రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాంబవరం గ్రామంలో ల్యాండ్ కన్వర్షన్‌ను పరిశీలించామన్నారు. రైతులకు పొలాలకు సంబంధించిన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశేఖర్, డీఆర్‌ఓ ఆదినారాయణరెడ్డి, సర్వేయర్లు వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండలో తిరుమలేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10వేల నగదును మృతుని భార్య సుమలతకు పంచాయతీ కార్యదర్శి షాహినూర్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పార్థసారథి కలిసి గ్రామ సర్పంచు దేగాని వెంకటేష్ చేతుల మీదుగా అందజేశారు. మిగిలిన రూ.90వేలు మృతుని భార్య బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లకు పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణా డిగ్రీ అటానమస్ కళాశాలలో మంగళవారం ఎలక్షన్ కంప్యూటర్ అపరేటర్లకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య తనిఖీ చేశారు.